క్లుప్తంగా

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం అజీమ్‌బాషా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను హెచ్‌ఎం వివరించారు. 225 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిమ్మయ్య, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యేశ్వరుడి హుండీ ఆదాయం రూ.23లక్షలు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు శ్రీ వల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి హుండీ లెక్కించినట్లు ఈఓ రామక్రిష్ణ గురువారం తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 12 నుంచి ఇప్పటి వరకు స్వామి వారికి హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించామన్నారు. అందులో రూ.23,76,741 నగదు, 6.600 గ్రాములు బంగారం, 2.237 కేజీల వెండి సమకూరిందన్నారు. కార్యక్రమానికి నంద్యాల జిల్లా దేవదాయశాఖ అధికారి శశికుమార్, గ్రామ పెద్దలు కృష్ణారెడ్డి, వీరయ్య, బీరం శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థినులతో ప్రిన్సిపాల్

గడివేముల: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ (ఎన్‌ఎంఎంఎస్)కు గడివేముల మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలజ గురువారం తెలిపారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న వైష్ణవి, మౌనికలు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు రాయగా 2023–24 సంవత్సరానికి ఎంపికై నట్లు చెప్పారు. వీరికి నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేల చొప్పున రూ.48వేలు అందించడం జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

సి.బెళగల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 2027– 2025 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సి.బెళగల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. గురువారం ఆయన అధ్యాపకులు చింతలయ్య, ఉపాధ్యాయుడు వరప్రసాద్‌తో కలిసి గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల వివరాలను వెల్లడించాడు. స్థానిక గురుకుల పాఠశాలలో చేరేందుకు బాలురకు అవకాశం ఉందని, ఐదవ తరగతి (ఇంగ్లిష్ మీడియం), కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు http://apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో 25/01/2024 నుంచి ఫిబ్రవరి 23వ తేదీ వరకు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 10 ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు.

30న హాకీ క్రీడాకారుల ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో జూనియర్, సబ్ జూనియర్ బాలురు, జూనియర్ బాలికల విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు హాకీ కర్నూలు అసోసియేషన్ కార్యదర్శి దాసరి సుధీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ క్రీడాకారులు 2008 సంవత్సరం పుట్టిన వారై ఉండాలని, జూనియర్ క్రీడాకారులు 2005 సంవత్సరంలో పుట్టిన వారు పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన క్రీడకారులు ఒరిజనల్ ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రం, రూ.10 ప్రవేశ రుసుంతో హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 10 నుంచి 12వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించనున్న 14వ హాకీ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9966565317 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నేడు రిపబ్లిక్ డే ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: స్థానిక సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గణతంత్ర దీప్తి పేరుతో గురువారం సాయంత్రం ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశభక్తి గీతాలు, జాతీయ సమైక్యత సంగీత విభావరి, అలనాటి తెలుగు చలన చిత్రాలలోని దేశభక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- బస్తిపాడులో పండుగ వాతావరణంలో పట్టాల పంపిణీ



సమావేశానికి హాజరైన ప్రజలు ,



బస్తిపాడులో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణంలో సహకారం అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు మండలం బస్తిపాడు జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమ పండుగ వాతావరణంలో జరిగింది. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో రెండో విడతలో 173 మంది పేదలకు ఇంటి పట్టాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని 30లక్షల మంది పేదలకు ఇళ్లు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కరోనా మహమ్మారి కారణంగా దేశంలో ఏ రాష్ట్రంలో కూడా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందలేదని, కానీ మన రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్నా పేదలు ఇబ్బందులు పడకుడదనే సంక్షేమ పథకాలు అందించామన్నారు.

త్వరలో నన్నూరు – కె.నాగలాపురం రోడ్డు విస్తరణ

నన్నూరు నుంచి కె.నాగలాపురం వరకు రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక బస్తిపాడు గ్రామానికి ప్రత్యేక్షంగా 18.50 కోట్లు, పరోక్షంగా రూ.8 కోట్లు ఖర్చు చేసి వివిధ అభివృద్ధి పనులు చేశామని తెలిపారు.

మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలి

మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలిచి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను, అవాస్తవాలను నమ్మి మోసపోవదన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పాలనలో తేడాను గమనించాలన్నారు. పేదలకు అందిస్తున్న నవరత్నాల పథకాల లబ్ధినిపై గతంలో టీడీపీ నాయకులు రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని, నేడు అంతకు మించి సంక్షేమ పథకాలు అందిస్తామని మోసపూరిత హామీలు ఇస్తున్నారని, వాటిని నమ్మవద్దని చెప్పారు. కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చిన్న కొట్టాల చింతారెడ్డి, తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీఓ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పాలన

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను గ్రామాల్లో ఏర్పాటు చేసి ప్రజల చెంతకే పాలన తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం బస్తిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, చిన్నటేకూరు గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, బస్తిపాడు జగనన్న కాలనీలో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులకు కావాలసిన ఎరువులు, పిచికారీ మందులు ఆర్బీకేల్లోనే అందుబాటులో ఉంచారని చెప్పారు. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, ఆర్ఓఆర్, అడంగల్, 1–బీ తదితర సర్టిఫికెట్లు గ్రామాల్లోనే అందిస్తున్నారని చెప్పారు. అలాగే బీపీ, మధుమేహం పరీక్షలతో పాటు వైద్యసేవలు అన్ని గ్రామాలకు తీసుకువచ్చామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో అన్ని ప్రజల ఇళ్ల ముంగిటకే సేవలు అందుతున్నాయన్నారు. కొంగనపాడు గ్రామంలో మిరప పంట దగ్ధం ఘటనలో పార్టీలకు సంబంధం లేక పోయినా టీడీపీ నాయకులు ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద ఈశ్వరయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మన్న, మద్దిలేటి, భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు సోమన్న, నాగేశ్వరరావు, మునిస్వామి, అశోక్ వర్దన్‌రెడ్డి, చంద్రారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



బస్తిపాడు జగనన్న కాలనీలో ఓహెచ్‌ఎస్‌ఆర్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

మళ్లీ జగనన్నే రావాలి



పేదలకు ఇంత మంది చేస్తున్న జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలి. మట్టి మిద్దెలో నివసిస్తున్న మమ్మల్ని గత ప్రభుత్వాలు పట్టించులేదు. జగనన్న నియమించిన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ గుర్తించి ఇంటి పట్టా వచ్చేల చేశారు. ఇంకా మాకు అమ్మ ఒడి, రైతు భరోసా పథకాలు అందుతున్నాయి. – కె.రాధ, బస్తిపాడు

ఇబ్బందులు తొలగాయి



కొన్నేళ్లుగా నేను, నా భర్త, వారి సోదరుల కుటుంబాలు, అత్తామామ కలిసి ఒకే ఇంట్లో ఉంటూ చాలా ఇబ్బందులు పడేవాళ్లం. జగనన్న కాలనీలో ఇంటి స్థలం రావడంతో ఇబ్బందులు తొలగాయి. గత ప్రభుత్వాలు మాలాంటి పేదలకు పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ మంచి చేస్తున్నాడు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – కె.రామ మద్దమ్మ, బస్తిపాడు

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో గురువారం నిర్వహించిన ఆడుదాం..ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన సరదాగా బ్యాటింగ్ చేసి, క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అనంతరం సెమీ ఫైనల్‌లో పాణ్యం జట్టుపై గడివేముల జట్టు విజయం సాధించిందినట్లు పీడీ హరిప్రసాద్ తెలిపారు. రెండో మ్యాచ్‌లో కల్లూరు మండలం, తడకనపల్లె జట్టు పై కర్నూలు ఎఫ్‌సీఐ జట్టు విజయం సాధించింది. చివరగా గడివేముల, కర్నూలు ఎఫ్‌సీఐ కాలనీ జట్టు ఫైనల్‌కు చేరుకున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓ ఓంకార్‌యాదవ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు, సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా అవార్డు



రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న తహసీల్దార్ జయన్న

కోడుమూరు రూరల్ : ఎన్నికల జాబితా నిర్వహణలో ప్రతిభ కనబర్చి ఉత్తమ సహాయ ఎన్నికల నమోదు అధికారిగా ఎంపికైన కోడుమూరు తహసీల్దార్ జయన్న గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. జాతీయ ఓటరు నమోదు దినోత్సవంలో భాగంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ చేతులమీదుగా అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అవార్డు అందుకున్న తహసీల్దార్ జయన్నకు కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ రామాంజినేయులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

శ్రీపక్కీరప్పతాతకు కన్నీటి వీడ్కోలు



కోడుమూరులో శ్రీపక్కీరప్పతాత అంతిమ యాత్ర దృశ్యం

కోడుమూరు రూరల్ : అధ్యాత్మిక గురువు పక్కీరప్ప తాత (88)కు గురువారం సాయంత్రం ప్రజలు, రాజకీయ ప్రముఖులు, శిష్యులు కన్నీటి వీడ్కోలు పలికారు. శ్రీపక్కిరప్ప తాత గత 20ఏళ్లుగా కోడుమూరులోని శ్రీరామిరెడ్డి తాత, శ్రీవల్లెలాంబదేవి ఆలయాల సన్నిధిలో ఉంటూ పలువురికి అధ్యాత్మిక బోధనలు చేసేవారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అనారోగ్యంతో శివైక్యం పొందడంతో గురువారం కోడుమూరులోని హంద్రీనది ఒడ్డున సమాధి చేశారు. ఆదోని, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్దన్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, కోడుమూరు ప్రజలు తాత అంతిమ యాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): దోమల నివారణకు మునిసిపల్ కార్పొరేషన్ చర్యలు తీసుకోవాలని సీపీఎం ఓల్డ్ సిటీ, న్యూసిటీ నగర కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం హంద్రీ నది వెంట సీపీఎం బృందం పర్యటించారు.

ఆర్‌యూ అభివృద్ధికి సహకరించండి



ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకరించాలని ఆర్‌యూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్‌ప్రేమ్‌కుమార్ కోరారు. వర్సిటీ నూతన వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన విజయవాడలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, ప్రభుత్వ సలహాదారు అజయ్‌కల్లంలను మర్యాదపూర్వకంగా కలిశారు. రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని వర్సిటీలో ఉన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సహకరించి అండగా నిలవాలని కోరారు.

హాస్టళ్ల తనిఖీ

నూతన వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ గురువారం వర్సిటీలోని మెన్, ఉమెన్ హాస్టల్స్‌ను తనిఖీ చేశారు. హాస్టళ్లలోని వసతులు, సౌకర్యాలను విద్యార్థులు, హాస్టల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాస్టల్స్‌ను నిర్వహించాలని సంబంధిత అధికారలను ఆదేశించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



కోడుమూరులో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



జేసీ మౌర్య నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న వీఆర్‌ఓ సుంకన్న

కోడుమూరు రూరల్ : రాజ్యాంగం ప్రసాదించిన ఎంతో విలువైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ సూచించారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని డిప్యూటీ తహసీల్దార్ రామాంజినేయులు ఆధ్వర్యంలో కాలేజీ విద్యార్థులు, బీఎల్వోలు కోడుమూరులోని పాతబస్టాండ్ నుంచి కొత్తబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మన్సురుద్దీన్ మాట్లాడుతూ ఓటు హక్కును ఓటర్లు దుర్వినియోగం చేయకుండా ఎన్నికల్లో తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉంటుందని, యువతి, యువకులంతా తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన యువతీ, యువకులంతా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ క్రిష్టారెడ్డి, బీఎల్వోలు, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలో గురువారం రెవెన్యూ అధికారులు, బీఎల్వోలు 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్ మాట్లాడుతూ భారత పౌరులకు రాజ్యాంగం ఓటుహక్కు కల్పించిందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక బస్టాండ్ వరకు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ జ్యోతి, ఏఎస్ఓ ఆదినారాయణ, ఏఎస్ఐ నాగయ్య, వీఆర్వోలు శేఖర్, నాగమ్మ, సాయిరమణ తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన గడివేములలో తహసీల్దార్ కార్యాలయం నుంచి పాత బస్టాండు వరకు తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులు, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గురునాథ్, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది సూరి, సచివాలయ సిబ్బంది అమలేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

పాణ్యం : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేలా అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. దరఖాస్తులను పరిశీలించి ఓటు హక్కు కల్పించామన్నారు. ఉత్తమ బీఎల్ఓలుగా గోరుకల్లు వీఆర్ఓ సుంకన్న, అనుపూరు మహిళా పోలీసు అధికారి వాణిని గుర్తించామన్నారు. ఈమేరకు వారు కర్నూలు జేసీ నారపురెడ్డి మౌర్య నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాణ్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు,



సి.బెళగల్లో ఓటరు దినోత్సవంను నిర్వహిస్తున్న అధికారులు

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలను ఉధృతం చేస్తామని ఎస్‌యూసీఐ(సీ) పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.రాఘవేంద్ర అన్నారు. గురువారం ఎస్‌యూసీఐ(సీ) నగర కార్యదర్శి ఎం.తేజోవతి అధ్యక్షతన రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెట్రోలు, డీజిల్‌తో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతుండడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. నూతన జాతీ య విద్యావిధానం, నూతన విద్యుత్ సవరణ బిల్లులను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ వి.హరీష్‌కుమార్‌రెడ్డి, నా యకులు ఎం.నాగన్న,ఖాదర్, విశ్వనాథ్‌రెడ్డి, బా బు, అశోక్, రోజా, ప్రియాంక, మల్లేష్, శక్రప్ప, బీచుపల్లి పాల్గొన్నారు.

29న యంగ్ ఇండియా సదస్సు

కర్నూలు(సెంట్రల్): విజయవాడలో ఈనెల 29న వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు కోరారు. గురువారం సీఆర్ భవన్‌లో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి కలల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. శ్రీరాములు, బాబయ్య, బీసన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటండి

కర్నూలు (టౌన్): వచ్చే నెల 3, 4 తేదీల్లో విశాఖపట్నం భీమిలిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ సబ్ జూనియర్ అండర్–14 పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని జిల్లా రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. గురువారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను ప్రధాన కార్యదర్శి ప్రకటించారు. జట్టులో భరత్, సూరి, మహేష్, రామ్‌చరణ్, అభిషేక్, రాజు, సీమన్, ప్రభుదాస్, నిఖిల్, మనోజ్, రామ్‌కుమార్, వెంకటచరణ్‌లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో శకటాలు, స్టాళ్ల ప్రదర్శన
- స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలకు సన్మానం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం



సిద్ధమైన వేదిక



వేడుకల్లో వైద్య, ఆరోగ్యశాఖ స్టాల్

కర్నూలు: గణతంత్ర దిన వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌లో జాతీయజెండా ఆవిష్కరణ, గౌరవ వందనం స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మైదానం మొత్తం రంగురంగుల జెండాలతో అలంకరించారు. వేదికకు ఇరువైపులా ప్రజాప్రతినిధులు, వీఐపీలు కూర్చునేందుకు వేదికలు ఏర్పాటు చేశారు. నగర ప్రముఖులు, విద్యార్థులు పెద్ద ఎత్తు న కార్యక్రమానికి హాజరవుతున్నందున వేదికకు అన్ని వైపులా షామియానాలు ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సన్మా నించేందుకు ఆహ్వానాలు పంపారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా ప్రగతిని చాటేలా శకటాల ప్రదర్శన, స్టాళ్లను ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఈ సందర్భంగా ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలను ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

నగరమంతా విస్తృత తనిఖీలు

భద్రతా పరంగా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నగరంలోని ప్రముఖ కూడళ్లు, జన రద్దీ ప్రాంతాలు, వ్యాపార సము దా యాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. ఏఆర్ఎస్ఐ నబిరసూల్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, పాపారాయుడు, డాగ్ స్క్వాడ్ హ్యాండ్లర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి నగరంలోని ప్రధాన రహదారు లతో పాటు రైల్వేస్టేషన్, బస్టాండ్, కలెక్టరేట్, ఆర్ఎస్ రోడ్, సిటీ స్క్వేర్ మాల్, జ్యోతి మాల్‌తో పాటు జన రద్దీ ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

మైదానంలో పరేడ్ రిహార్సల్

జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో గురువారం గణతంత్ర వేడుకల పరేడ్ రిహార్సల్స్‌ను పోలీసులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ కృష్ణకాంత్ హాజరై గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ పతాకం ఆవిష్కరణ, పరేడ్ రిహార్సల్స్ అతిథుల గ్యాలరీలు, స్టాల్స్‌ను ఎస్పీ పరిశీలించారు. వేడుకలకు అతిథులు, ప్రముఖులు, విద్యార్థులు హాజరవుతున్నందున అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. వాహనాల పార్కింగ్, ప్రొటోకాల్ అంశాలపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.



కలెక్టరేట్ వద్ద తనిఖీ చేస్తున్న డాగ్‌స్క్వాడ్

అడిషనల్ ఎస్పీలు నాగరాజు, నాగబాబు, ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషా, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సివిల్, ఏఆర్, ట్రాఫిక్ సిబ్బంది, స్కౌట్ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.